క్లుప్తంగా

బాధితులకు 'కర్లపాటి' ట్రస్ట్ చేయూత



జగ్గయ్యపేట అర్బన్: వరద బాధితులకు కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) కొనియాడారు. కాకానినగర్‌లోని ట్రస్ట్ కార్యాలయం ఆవరణలో 100మంది వరద బాధితులకు గురువారం నిత్యావసర సరుకులు, దుప్పట్ల పంపిణీ చేశారు.కార్యక్రమానికి ఎమ్మెల్యే తాతయ్య హాజరై బాధితులకు అందజేశారు. వరద కారణంగా ఇల్లు కూలిపోయిన పోతులూరి లక్ష్మి, కావటి లక్ష్మిలకు తక్షణసాయంగా రూ.10వేలను అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు, సామాజిక వేత్త కర్లపాటి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావు, నాయకులు మైనేని రాధా, బాలకృష్ణ, రాయపూడి వెంకటేశ్వరరావు, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకునిపై దాడి

వీరులపాడు:వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడనే నెపంతో ఓ యువకునిపై పలువురు దాడి చేసి గాయపరిచిన ఘటన మండలంలోని జుజ్జూరులో గురువారం చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే..జుజ్జూరుకు చెందిన రావుల గోపి అనే యువకుడు గురువారం సాయంత్రం పెట్రోలుబంక్‌కు వెళ్లివస్తుండగా, అదే గ్రామానికి చెందిన నాగూర్‌బాషా మరికొంతమందితో కలిసి అతనిపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్సనిమిత్తం 108లో నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు బాధితుడి తండ్రి శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేశామని దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఆస్తినష్టంపై సర్వే




జగ్గయ్యపేట అర్బన్: వరద ముంపునకు గురై తీవ్రంగా నష్టపోయిన వారందరిని ప్రభుత్వం ఆదుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ కోరారు. స్థానిక 6వ వార్డు కాకానినగర్ టెలిఫోన్ కాలనీలో వరదలు వచ్చి పలు గృహాలు ముంపునకు గురయ్యాయి. ఆస్తినష్టం అంచనాపై గురువారం వార్డులో సచివాలయ సిబ్బంది సర్వే నిర్వహించారు. సర్వే సిబ్బందితో కలిసి వైస్‌చైర్మన్ ప్రభాకర్ బాధితుల ఇళ్లను సందర్శించారు. వార్డు ప్రజలకు జరిగిన నష్టాన్ని అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు ప్రభుత్వం వెంటనే నిత్యావసర సరుకులు అందజేయాలని కోరారు. లన్నారు.

కాజ్‌వే వద్ద స్తంభాల పరిశీలన

పెనుగంచిప్రోలు: స్థానిక మునేరు కాజ్‌వేపై వరద ధాటికి విరిగిపోయిన విద్యుత్ స్తంభాలను జగ్గయ్యపేట మాజీఎమ్మెల్యే సామినేని ఉదయభాను గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా సర్పంచ్ వేల్పుల పద్మకుమారి మాట్లాడుతూ వరద ప్రవాహానికి మొత్తం స్తంభాలు విరిగిపోయాయని, కొత్తగా రూ.3లక్షల విలువ చేసే కేబుల్ తెస్తే అదికూడా కొట్టుకుపోయిందని తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన కృషి చేస్తున్నామని వివరించారు

ఆదుకుంటున్న సంస్థలు



జగ్గయ్యపేట: బూదవాడ గ్రామంలోని రోడ్లను అల్ట్రాటెక్ సిమెంట్స్ కర్మాగారం ప్రతినిధులు ఫైర్ ఇంజిన్ల సాయంతో శుభ్రం చేస్తున్నారు. ఇప్పటికే ఫ్యాక్టరీ వద్ద పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి చేసి వసతులు కల్పించారు. తమకు అల్ట్రాటెక్ సిమెంట్స్ యాజమాన్యం అండగా నిలిచిందని గ్రామస్తులు చెబుతున్నారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు కన్నెత్తి కూడా చూడలేదని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. అదేవిధంగా మండలంలోని రెడ్డినాయక్‌తండాలోని 200 కుటుంబాల వారికి జగ్గయ్యపేట విజ్ఞాన్ పాఠశాల యాజమాన్యం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. రెడ్డినాయక్‌తండాలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం పర్యటించి బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలుపగా, అన్నవరం, బలుసుపాడు గ్రామాల్లో నష్టపోయిన పంటలను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పరిశీలించారు.

కంట్రోల్ కేంద్రం ఏర్పాటు

జగ్గయ్యపేట అర్బన్: భారీ వర్షాల నేపథ్యంలో స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో కంట్రోల్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ఎం.రామ్మోహనరావు గురువారం తెలిపారు. పట్టణ పరిధిలోనిలోతట్టు ప్రాంతాల ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు ఈ కేంద్రం ఏర్పాటుచేశామన్నారు. ప్రజలు అత్యవసర సమయంలో ఈ కంట్రోల్ కేంద్రంలోని ఫోన్ నెంబర్ 08654-222335కు ఫోన్‌చేసి సహాయం పొందాలని సూచించారు.



అనిగండ్లపాడు వద్ద కూచివాగు ఉధృతికి ఇబ్బందుల్లో ప్రజలు



వరద ఉధృతికి దెబ్బతిన్న చిల్లకల్లు మంచినీటి పథకం



శనగపాడు వద్ద కొట్టుకుపోయిన చప్టా



ఉధృతంగా ప్రవహిస్తున్న జుజ్జూరు గ్రామ సమీపంలోని ఏనుగుగడ్డ వాగు

వీడని వరద భయం

వాయుగుండం ప్రభావంతో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లోని వాగులు పొంగిపొర్లుతున్నాయి. మునేరుకు వరద నీరు చేరుతోంది. నందిగామ డివిజన్‌లో గురువారం 159.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరద ముంపు నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటుండగా వాయుగుండం ప్రభావంతో పెనుగంచిప్రోలు మండలంలో 48.6మిల్లీమీటర్ల వర్షం, వత్సవాయి మండలంలో 56.0, వీరులపాడు మండలంలో 23.0మిల్లీమీటర్ల వర్షం కురవడంతో ఆయా మండలాల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. వైరాకట్టలేరు, ఏనుగుగడ్డ వాగుల్లో వరద ఉధృతి ఐదురోజులుగా కొనసాగుతూనే ఉంది. వరద ముంపు కారణంగా జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల మధ్య నున్న రోడ్లు, చప్టాలు, కాజ్‌వేలు దెబ్బతినడంతో ఐదురోజులుగా రాకపోకలు సాగడం లేదు. మంచినీటి పథకాలు నీటమునగడంతో పలు గ్రామాలకు నీటిసరఫరా నిలిచిపోయింది. తాగునీటి కోసం ప్రజలు అవస్థలుపడుతున్నారు. పంటలు ఇంకా నీటిలోనే నానుతున్నాయి. ఈక్రమంలో వాయుగుండం ప్రభావంతో మళ్లీ వర్షాలు కురిస్తే తాము కోలుకోలేమని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. – జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, కంచికచర్ల, వత్సవాయి, జగ్గయ్యపేట అర్బన్, వీరులపాడు



కోతకు గురైన పరిటాల-గనిఆత్కూరు రోడ్డు



బాధితులను పరామర్శిస్తున్న నెట్టెం రఘురాం



కంచికచర్ల ఓసీ కళ్యాణ మండపంలోని పునరావాస కేంద్రంలో భోజనం చేస్తున్న వరద బాధితులు




లింగగూడెం వద్ద గండివాగుపై వరద ఉధృతి



చెన్నారావుపాలెంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంట



అనిగండ్లపాడు వద్ద నీటమునిగిన వరి పొలాలు



జగ్గయ్యపేట మండలం బూదవాడలో కుళ్లిన పత్తి చేను



తక్కెళ్లపాడులో ఇసుక, రాళ్లతో మేట వేసిన వరిపొలం



ముచ్చింతాల వద్ద రోడ్డుకు పడిన గండిని పరిశీలిస్తున్న ఉదయభాను



జగ్గయ్యపేటలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

బాధితులను తక్షణమే ఆదుకోవాలి

సామినేని ఉదయభాను

ముచ్చింతాల, అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): తుఫాన్ ధాటికి దారుణంగా నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి సాయం అందలేదని జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఆయన గురువారం పెనుగంచిప్రోలు మండలంలోని ముచ్చింతాల, అనిగండ్లపాడు గ్రామాల్లో పర్యటించారు. వరదల కారణంగా దెబ్బతిన్న పంట పొలాలు, ఇళ్లను పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. ఈసందర్భంగా ఉదయభాను విలేకరులతో మాట్లాడుతూ మునేరు, పాలేరు వరదకు నియోజకవర్గంలో వేలాది ఎకరాల్లో పంటపొలాలు, ఇళ్లు దెబ్బతిన్నాయన్నారు. వరదలకు నష్టపోయి ఐదురోజులు దాటినా నేటివరకు బాధితులకు ప్రభుత్వం నుంచి నిత్యావసర సరుకులు, నష్టపరిహారం కింద ఒక్క రూపాయి కూడా అందకపోవడం శోచనీయమన్నారు. గత ప్రభుత్వంలో బాధితులను వెంటనే ఆదుకున్న వైనాన్ని గుర్తుచేశారు. వరిపంట నష్టానికి ఎకరాకి రూ.30వేలు, వాణిజ్యపంటలకు ఎకరాకి రూ.లక్ష ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఆయన వెంట సర్పంచ్‌లు వేల్పుల పద్మకుమారి, జక్కులూరి రాంబాబు, బి జ్యోతిబ్రహ్మం, పాపినేని వెంకటేశ్వరరావు, నెడ్‌క్యాప్ మాజీ చైర్మన్ వేల్పుల రవి కుమార్, తన్నీరు నాగేశ్వరరావు, గుంటుపల్లి వాసు, బత్తుల రామారావు, చేని కుమారి, వూట్ల నాగేశ్వరరావు, మాదల వీరయ్యచౌదరి, జి.వడ్డీకాసులు, నంబూరు రవి, గూడపాటి శ్రీనివాసరావు, మల్లెంపాటి సతీష్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే సామినేని ఉదయభాను

సంక్షిప్తం

దెబ్బతిన్న పొలాల పరిశీలన

చందర్లపాడు(నందిగామటౌన్): వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ విమర్శించారు. చందర్లపాడు మండలంలోని తోటరావులపాడు, చింతలపాడు, కొడవటికల్లు, కొండపేట గ్రామాల్లోని నీట మునిగిన వంట పొలాలను వ్యవసాయ కార్మిక సంఘం, రైతు, కౌలురైతు సంఘ నాయకులతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. నాయకులు ఆంజనేయులు, చనుమోలు సైదులు, కోట కళ్యాణ్, ఏడుకొండలు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



నందిగామ టౌన్: ఇటీవల కురిసిన వర్షాలకు తోడు ఎగువ నుంచి వచ్చిన భారీ వరద కారణంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ధ్వంసమైన రోడ్లకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. మండలంలోని జాతీయ రహదారి నుంచి కంచల వెళ్లే రహదారి, చందాపురం-చందర్లపాడు రహదారి పూర్తిగా ధ్వంసం కావడండతో ప్రజలు అవస్థలుపడుతున్నారు. దీంతో మరమ్మతులు చేపట్టారు. కాగా కంచల గ్రామంలో బుధవారం మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పర్యటించిన నేపథ్యంలో పాలకులు యుద్ధప్రాతిపదికన ఈ రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 600 గ్రాముల గంజాయిని పోలీసులు దాడిచేసి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు..స్థానిక రంగుబజారులో ఓ ఇంటిలో అక్రమంగా గంజాయిని నిల్వచేసినట్లు సమాచారం అందడంతో దాడిచేసి 600గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బీఈ. వెంకటేశ్వరరావు తెలిపారు. సురవరపు శివకుమార్ అనేవ్యక్తితోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

శానిటేషన్ పనులు చేపట్టాలి

కంచికచర్ల: వరద ముంపు గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు పంచాయతీ పాలకులు, సిబ్బంది వెంటనే శానిటేషన్ పనులు చేపట్టాలని ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు సూచించారు. ఆయన గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ లోతట్టుప్రాంతాల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా చూడాలని, డ్రెయిన్లలో పూడికతీయాలని, తాగునీటిని క్లోరినేషన్ చేయాలని సూచించారు. బ్లీచింగ్, సున్నం చల్లించడంతోపాటు దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

నేటి నుంచి నీటిసరఫరా

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో నేటి నుంచి కొన్ని వార్డులకు శుక్రవారం నుంచి మంచినీటిని సరఫరా చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పద్మావతినగర్, విలియంపేట, చాకలిబజారు, రంగస్వామి బజారు, నాగమయ్యబజారు, బ్రాహ్మణబజారు, అద్దాల బజారు, మంగళిబజారు, చెరువుబజారు, బంగారుపేట, మార్కండేయబజారు, ఆకులవారి వీధి, కాయితాల బజారు, చిరునగర్, సీతారామపురం, విద్యానగర్, ధనంబోడు, గాయత్రీ ఆశ్రమం వీధి ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తామని వివరించారు. మిగిలిన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుడికి సత్కారం



కంచికచర్ల: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్‌బీఐ మెయిన్‌శాఖలో గురువారం టీచర్ గంగిరెడ్డి రంగారావును బ్యాంకు అధికారులు ఘనంగా సత్కరించారు. మేనేజర్లు జీ గోపీకృష్ణ, ఎం.సురేంద్ర మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు. ఫీల్డ్ అధికారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వరదనష్టం పరిశీలన

జగ్గయ్యపేట అర్బన్: వరద బాధితులకు నష్టపరిహారం అందజేసి వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) తెలిపారు. స్థానిక కర్లబజారు, యానాదుల కాలనీ, శివగంగ కాలనీ, కాకానినగర్, డాంగేనగర్ ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. వరద ఉధృతికి ధ్వంసమైన ఇళ్లు, సామగ్రిని పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నష్టపరిహారాన్ని అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్ గొట్టె నాగరాజు, పేరం సైదేశ్వరరావు, సామినేని మనోహర్, నాయకులు మైనేని రాధా, వేదులాపురి సైదా, యామర్తి బోస్, కల్లం రామిరెడ్డి, కేఎస్.రెడ్డి, చలసాని నాని, జనసేన నాయకులు షేక్ మోసిన్, కారం శ్రీను, శ్యామలక్, నాగయ్య, మాజీ కౌన్సిలర్ గుంజ ఏడుకొండలు, స్థానిక నాయకులు తిమ్మసర్తి రామారావు, ముళ్లపూడి అప్పారావు, షేక్ మదార్, కావేటి కృష్ణ, గాలం శ్రీను, మొగిలి సైదులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కంచికచర్ల: పరిటాలలో పేకాడుతున్న తొమ్మిది మందిని పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఆరు బైక్‌లు, రూ.9,120 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బోనగిరి రాజు తెలిపారు. నిందితులను శుక్రవారం కోర్టుకు హాజరుపరుస్తామని ఎస్ఐ వివరించారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం



జగ్గయ్యపేట: వరద ఉధృతికి పాలేరు పరివాహక ప్రాంత గ్రామాల్లోని తక్కెళ్లపాడు, గరికపాడు, బలుసుపాడు, అన్నవరం, రెడ్డినాయక్‌తండ, బూదవాడ, జగ్గయ్యపేట పట్టణంలోని పలు ప్రాంతాలలో తీవ్ర నష్టం వాటిల్లింది. వరద ఉధృతికి పలు గృహాలు కొట్టుకుపోగా, వరి, పత్తి, మిర్చి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గృహాలలోకి వరద నీరు చేరడంతో గృహాల్లోని విలువైన వస్తు, సామగ్రి పాడైపోయాయి. కొన్ని ఇళ్లలోని వస్తువులు కొట్టుకుపోయాయి.

పత్తాలేని అధికారులు ..

వరద ముంపునకు జగ్గయ్యపేట మండలంలోని పలు గ్రామాలు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. విద్యుత్ సదుపాయం లేక గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. పట్టించుకోవాల్సిన రెవెన్యూ, పంచాయతీ, వైద్యాధికారులు పత్తాలేకుండా పోతున్నారు. బూదవాడ, అన్నవరం, తక్కెళ్లపాడు గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మునేరుకు స్వల్పంగా వరద

పెనుగంచిప్రోలు: వాయిగుండం ప్రభావంతో పెనుగంచిప్రోలు మండలంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ముచ్చింతాల సమీపంలోని గండివాగు అనిగండ్లపాడు వద్ద కూచివాగు, దూళ్లవాగుకు గురువారం భారీగా వరదనీరు రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పత్తి, మిర్చి, అరటి తోటలు దారుణంగా దెబ్బతిన్నాయి. ముచ్చింతాల, రేగులగడ్డ వద్ద రోడ్డు కొట్టుకుపోయి ఇసుక మేట వేసింది.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని వైరా కట్టలేరు, ఏనుగుగడ్డ వాగు నేటికీ ఉధృతంగానే ప్రవహిస్తున్నాయి. చెన్నారావుపాలెం, రంగాపురం, పెద్దాపురం, జుజ్జూరు, నరసింహారావుపాలెంల్లోని వరి, పత్తి, మొక్కజొన్న పంటలు నీటమునగడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

లింగాల వద్ద పెరిగిన వరద తాకిడి...

లింగాల(వత్సవాయి): మునేటికి ఎగువప్రాంతమైన తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో వర్షాలు పడుతుండటంతో గురువారం మునేటికి వరద తాకిడి మళ్లీ పెరిగింది. మునేటికి 15,033 క్యూసెక్కుల వరదనీరు వచ్చినట్లు ఇరిగేషన్ ఏఈ ఆర్.రామనరసింహారావు తెలిపారు. వరద ఉధృతికి ఇప్పటికే కాజ్‌వే దెబ్బతినడంతో వత్సవాయి నుంచి లింగాల, వేమవరం, కంభంపాడు, కాకరవాయి, తాళ్లూరు, మాచినేనిపాలెం, వత్సవాయి, వేములనర్వ, దబ్బాకుపల్లి, పెంట్యాలవారిగూడెం, పోలంపల్లి, పోచవరం గ్రామాల ప్రజలకు జగ్గయ్యపేట వైపు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.